# దరఖాస్తులు

త్రిభువనదాస్ భాగ్యవంతుడు. భాగ్యవంతు డంటే యిలాగా అలాగా కాదు; అతి భాగ్యవంతుడు. అతనికి ఎంత ఆస్తివుందో అతనికే తెలియదు. ఆ ఆస్తి వెండి రూపాయిలుగా మారిస్తే, ఆ వెండిరూపాయలు కన్యాకుమారినుంచి వింధ్యపర్వతాల దాకా పేర్చవచ్చునని ఒక వృద్ధుండుడు అంచనా కట్టాడు. అతను తలుచుకుంటే అణాన్నరకి దొరికే షేవింగ్ బ్లేడ్, అర్ధరూపాయికక్కూడా దొరక్కుండా చెయ్యగలడని కొందరు అర్ధశాస్త్ర కోవిదులు అంటారు. అందులోని నిజానిజాలు మన కంతగా తెలియవు. త్రిభువనదాస్ సన్మార్గుడనీ, దాన ధర్మాలు విరివిగా చేస్తాడనీ మరికొంతమంది అంటూ వుంటారు. ఆ విషయమూ మనం అంతగా నమ్మకూడదు. త్రిభువనదాస్ గుప్పెట్లో 13 పెద్ద కంపెనీలు వున్నాయి. అతను ఎవరికీ ఒకపట్టాన కనిపించడు. పన్నెండేండ్లబట్టీ పనిచేస్తూ, అతని మొహం ఎలా వుంటుందో చూడని బ్రాంచి మేనేజర్లు చాలామంది వున్నారట.

13 కంపెనీల తాలూకు ఏ ఆఫీసులో ఎక్కడ ఏ ఉద్యోగం ఖాళీవచ్చినా, ఆ ఉద్యోగంకోసం వచ్చిన దరఖాస్తుదారులందర్నీ పరీక్షించి, వారిలో బాగా పనికొచ్చేవాడిని ఏరుకునేందుకు ఒక డిపార్టుమెంటు వుంది. దానిపేరు ఉద్యోగాల

శాఖ. ఆ శాఖానిర్వహణలో బోలెడంత కర్మకాండ వుంది. ఏదో ఒక ఆఫీసులో గుమాస్తాగిరీ ఖాళీ అవుతుం దనుకోండి. ఫలానా త్రిభువనదాస్ కంపెనీలో, ఫలానా బ్రాంచిలో, ఫలానారకం ఉద్యోగం ఖాళీగా వుందనీ, ఫలానా అర్హతలు వున్నవారు, ఫలానా తేదీ అయిదుగంటల లోపున సదరు ఆఫీసుకి అందేటట్టు దరఖాస్తులు పెట్టుకోవచ్చుననీ దినపత్రికలలో ప్రకటిస్తారు. లక్షలాది నిరుద్యోగులున్న ఈ దేశంలో దరఖాస్తుదారులకి కొదవ ఏమిటి?

దరఖాస్తులు చూసే డిపార్టుమెంటులో నలుగురు గుమాస్తాలూ, ఒక హెడ్డూ వున్నారు. ఆ హెడ్డు మా దాశరథి. గుమాస్తాల్ని సెలెక్టు చెయ్యడం దాశరథిపని. దరఖాస్తూ, దరఖాస్తుకి గుచ్చి కంపెనీవారి ఫార మొకటీ ఉంటాయి. ఆ ఫారమ్‌మీద దాశరథి తన రిమార్కులు రాయాలి. రూపం-తెలివి—ప్రపంచజ్ఞానం-మిగతా విశేషాలు; ఈ నాలుగూ పూరించి, తను ఏ కారణంవల్ల ఫలానా దరఖాస్తు దారుని ఏరినదీ వివరిస్తూ చిన్ననోట్ రాసి, త్రిభువనదాస్‌గారి సెక్రెటరీకి పంపాలి దాశరథి. అదంతా క్రమపద్ధతిలో జరగవలసిన తంతు. దాశరథి చేసిన సెలెక్షన్ పైవాళ్ళెప్పుడూ కాదనరు.

* * * *

‘‘ఇది భలే ఉద్యోగం!’’ అన్నాను.

"ఏం—అలా అంటావ్ ?"అని అడిగాడు దాశరథి.

"నీ పని ఉద్యోగా లివ్వడమేగా !"

"అదిమాత్రం మాటలా ? ఒక్కరోజువచ్చి చూచో నా ఆఫీసులో—నీకే తెలుస్తుంది !"అని బెదిరించాడు.

ఉద్యోగం తీసెయ్యడమంటే కష్టం—ఒకళ్ళ కడుపు కొట్టడమవుతుంది కనక ! ఉద్యోగం యివ్వడమంటే ఏదో పెళ్ళిభోజనం పెట్టడంలాంటిది. దాశరథి ఉద్యోగమే నాకు వుంటే ఎంత సంతోషిద్దును !

"నువ్వు చాలా అదృష్టవంతుడివి, దాశరథీ."
"రేపు మా ఆఫీసుకి రా."

* * * *

మర్నాడు దాశరథి ఆఫీసుకి వెళ్ళాను అతని టేబుల్ మీద 109 అప్లికేషనులు కంపెనీవారి ఫారాలతోసహా ఒక గుట్టగా పడివున్నాయి.

ఆఫీసులో 7 వ సెక్షనులో 5 వ గుమాస్తాని సెలెక్ట్ చెయ్యాలి మా దాశరథి, దరఖాస్తుదారు లందరూ యిరవై యిరవై మూడేళ్ళ మధ్య నున్నవారు.

"ఇవన్నీ నెంబరువారీగా వున్నాయి. దరఖాస్తుదారుది ఎన్నో నెంబరో బయట నోటీసు బోర్డులో ఉంటుంది"

అన్నాడు దాశరథి, నాకు తన ఉద్యోగ ధర్మాన్ని పరిచయంచేస్తూ.

కాలింగ్ బెల్ కాక ఎలెక్ట్రిక్ బెల్ నొక్కగానే బయట నుంచి మొదటి దరఖాస్తుదారు లోపలికి ప్రవేశించాడు. టై లేదుగాని కాటన్ సూటు వేసుకున్నాడు.

"పేరు...మాధవరావు కాదూ?"

"అవునండి."

"బ్రిటన్ కి ప్రధానమంత్రి ఎవరు?"

"చర్చిల్."

"ఆల్ రైట్, ఇటుపక్క హాలులోకి వెళ్ళికూచోండి. మిగతా వారినికూడా పరీక్షించినమీదట మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

మాధవరావు పక్కహాలులోకి వెళ్ళి కూచున్నాడు. దాశరథి అతని తాలూకు ఫారమ్‌మీద యిలా రాశాడు: "ఉన్నదున్నట్టు మొహంమీద చెబుతాడు."

రెండవ దరఖాస్తుదారు ప్రవేశించాడు. గీరలపాంటూ, బుష్‌కోటూ, కళ్ళజోడు కూడాను.

"పేరు?" అని అడిగాడు దాశరథి,

"గోకుల్."

"బ్రిటన్ కి ప్రధానమంత్రి ఎవరు?"

"మాల్టోవ్."

"ఆల్ రైట్. ఇటుపక్క హాలులోకి వెళ్ళి కూచోండి. మిగతా వారిని కూడా పరీక్షించినమీదట, మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

గోకుల్ పక్క హాలులోకి వెళ్ళి కూచున్నాడు. దాశరథి గోకుల్ కి సంబంధించిన ఫారమ్‌మీద యిలా రాశాడు: "ఊహాపోహాలు గల మనిషి."

"బ్రిటిష్ ప్రధాని మాల్టోవ్ అనేవాడికి వూహా పోహా లేమిటి-నీ తలకాయ నా తలకాయ" అన్నాను దాశరథితో.

"దీన్నే 'యింటెలిజెన్స టెస్ట్' అంటాము. ఆ కుర్ర వాడికి తెలిసే, మనల్ని తమాషా చేసేందుకు చెప్పాడేమో!"

"ఏడ్చినట్టే వుంది—కానియ్."

మూడవ దరఖాస్తుదారు వచ్చాడు. బిళ్ళగోచీ, పంచె కట్టు, లాల్చీ.

"పేరు ?"

"వినోదబాబు."

"బ్రిటన్ కి ప్రధానమంత్రి ఎవరు ?"

"బ్రిటన్ కి ప్రధాని ఎవరో తరవాత చూసుకుందాము గాని, ఆ ఉద్యోగం నాకిప్పించారా, నేను ఇండియాకి ప్రధాని నవుతాను."

ఆభరణంలా ధరించే చిరునవ్వు చెదరకుండా దాశరథి, "ఆల్ రైట్, ఇటు పక్కహాలులోకి వెళ్ళి కూచోండి. మిగతావాళ్ని కూడా పరీక్షించిన మీదట, మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

మూడవ దరఖాస్తుదారు పక్కహాలులోకి వెళ్ళాడు. నాకు వొళ్ళు మండిపోతోంది. ఈ దరఖాస్తు దారులందరూ ఒక పిచ్చిసజ్జులా వున్నారు. వినోదబాబు ఫారమ్‌మీద యిలా రాశాడు మావాడు: 'అనవసరమైనవాటి జోలికి పోడు.'

నేనొక సిగరెట్టు ముట్టించి దాశరథికి ఆఫర్ చేశాను. "నువ్వు కాల్చుకో, నేను కాల్చకూడదిక్కడ. నేను సిగరెట్టు ముట్టిస్తే, మా డిపార్ట్‌మెంటల్ బాయ్స్ బీడీలు ముట్టిస్తారు" అన్నాడు దాశరథి.

ఇంతలో నాలుగవ దరఖాస్తుదారు వచ్చాడు. ఖద్దరు చొక్కా ఖద్దరు పంచె—టోపీమాత్రం లేదు.

"పేరు ?"

"చిదంబరం."

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు ?"

చిదంబరం—'యింత చిన్న విషయం నాకు తెలియదను కున్నారా !' అన్నట్టు మొహంపెట్టి—"ఆఁ...యివ్వాళ పేపరు చూడటం మర్చిపోయాను." అన్నాడు.

"ఆల్ రైట్. ఇటు పక్క హాలులోకి................"

నాలుగవ దరఖాస్తుదారు పక్క హాలులోకి వెళ్ళాడు. నా కింక కోపతాపాలు పోయాయి. విరోధులక్కూడా దాశరథి ఉద్యోగంలాంటిది వొద్దనుకున్నాను. చిదంబరం ఫారమ్మీద యిలా రాశాడు: 'ఎంతకావాలో అంతే తెలుసుకుంటాడు.'

అయిదవ దరఖాస్తుదారు బ్రిటన్‌కి ప్రెసిడెంటే గాని ప్రధాని లేడన్నాడు. ఆరవ అతను—బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేనో, ట్రూమనో అయుండాలి. ఎవరయితే మనకేం—అన్నాడు. ఏడవ అతను తడుముకోకుండా 'రూజ్‌వెల్ట్' అన్నాడు. 12 వ అతను 'జార్జి' అన్నాడు. 34 వ అతను 'ముసోలినీ' 'స్టాలిన్ పేరు చెప్పిచూదామనుకున్నాడు'—69 వ అతను.

లంచ్ టైములో దాశరథితో అన్నాను: "ప్రతి చవట వెధవనీ యిలా చిరునవ్వుతో ఆహ్వానించి, వాడు చెప్పే వెర్రిసమాధానం శ్రద్ధగా విని, మళ్ళీ వాణ్ణి చిరునవ్వుతో సాగనంపడానికి చాలా ఓర్పు కావాలి. నీ కెంత యిచ్చినా మీ వాళ్ళకి నష్టంలేదు. నాకైతే వాళ్ళ జవాబులు వినలేక పిచ్చెత్తుతోంది సుమా! వెనక ఒక టీచరు మిత్రుడు చెప్పాడులే. 'మద్రాస్‌నుంచి ఏమి ఎగుమతి అవుతుంది'—అని తను ప్రశ్నయిస్తే—'కచ్చికలు' అని రాశాడట, ఒక అఖండుడు. ఆ కుర్రవాడికి 'కచ్చికలు' మినహా మరొకటి స్ఫురించకపోవడం వింతగా లేదూ?"

"నో, నో, ఆ కుర్రవాడు పెద్దయిన తర్వాత పళ్ళ వ్యాధితో బాధపడతాడు."

"ఇలాంటి మిడతంభొట్లు శకునాలు చెబుతేనే, ఆ త్రిభువన దాస్ నీకీ ఉద్యోగం యిచ్చినట్టున్నాడు."

"ఏమైనా, సాయంత్రందాకా వుండి యజ్ఞం పూర్తి చేయించి వెళ్ళు."

లంచ్ అయాక మళ్ళీ మొదలెట్టాడు దాశరథి.

"పేరు ?"

ఫలానా...వెంకయ్యో, తిమ్మప్పో, మాసిలామణో, రామునినాయరో...ఏదో ఒకటి.

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు ?"

84 వ అతను 1947 ఆగస్టు 15 వ తేదీనుంచీ తనా పక్కకి చూడటం మానేశా నన్నాడు. 93 వ అతను 'స్మట్స్' అన్నాడు, మహా తెలివిగా. 108 వ అతను మన కెందుకు పోనిద్దురు.' అన్నాడు కలుపుగోలుతనంగా.

పరీక్ష సర్వసంపూర్ణం అయేప్పటికి నాలు గయింది. 109 మంది దరఖాస్తుదారులకీ మధ్యాహ్నం కాఫీ టిఫినూ త్రిభువనదాస్ కంపెనీవారి కాంటీన్ ఫ్రీగా సప్లయిచేసింది. అందరూ ఫలితంకోసం ఎదురుచూస్తూ పక్క హాలులో కూచున్నారు. దాశరథ ఎవరిని సెలక్టు చేస్తాడా అని నేనూ ఎదురు చూస్తున్నాను.

చటుక్కున ఫోన్ తీసి, "అవునవును... సెక్రటరీగారు కావాలి... దాశరథి మాట్లాడుతూవుంట... ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ దాశరథి. E ఆఫీసులో 7 వ సెక్షన్‌లో 5 వ గుమాస్తాగా గోకుల్‌ని సెలెక్టు చేశాను," అన్నాడు.

"ఓకె, ఓకె." అని వినిపించింది ఫోనులోనుంచి.

గోకుల్ లోపలకి పిలువబడ్డాడు. మిగతా 108 మంది ఏడుపు మొహాలతో యిళ్ళకి వెళ్ళిపోయారు. దాశరథి గోకుల్‌కి ఒక పచ్చకార్డు యిచ్చాడు; మర్నాడు పొద్దున్న 9-55కి E ఆఫీసు దగ్గర హాజరై 7 వ సెక్షన్ హెడ్డుని కలుసుకోమన్నాడు. గోకుల్ ఎంతో సంతోషంగా వెళ్ళిపోయాడు.

"నీ సెలక్షన్ నా కేమీ నచ్చలేదు, బ్రదర్, బ్రిటిష్ ప్రధాని పేరేమిటో తెలియనివాడికి ఉద్యోగ మివ్వడమేమిటి?"

"పోన్లెద్దూ, నా డ్యూటీ నేను చేశాను" అన్నాడు దాశరథి.

* * * *

మూడురోజులు పోయాక, సాయంత్రంవేళ క్లబ్బులో కనిపించి చెప్పాడు దాశరథి: "నన్ను మా కంపెనీవాళ్ళు అమెరికా పంపిస్తున్నారు. స్టడీటూర్."

"ఏడ్చినట్టేవుంది. బ్రిటిష్ ప్రధాని మాల్టోవ్ అన్న బదుద్ధాయికి ఉద్యోగం యిచ్చిన ఘనుడివి కనకనా?"

"అక్కడేవుంది కీలకం."

"ఏమిటది ?"

"గుమాస్తాలని సెలెక్టు చెయ్యడంలో నాఅంతటివాడు ఇండియాలో లేడని త్రిభువనదాస్ అన్నాడట. నా సెలెక్షన్ చాలా బావుంది కనక అమెరికా పంపిస్తున్నారు."

"ఎందుకని బావుంది ?"

"గోకుల్ అనేబావమరి దొంకడు మాసెక్రటరీకి వున్నాడని నేను ముందు తెలుసుకుని వుండటంవల్ల."

సమాప్తి.

---

కథా నిలయం
6019
శ్రీకాకుళం